సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 18 । జూలై । 2025



వసతులు కల్పించండి

డబుల్ బెడ్రూం ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. 8లో▸



వరుణుడి కోసం..

వరుణుడి రాక కోసం రైతులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. 8లో▸



వైభవంగా బోనాలు

బాలాపూర్ గుర్రం చెరువు కట్టమైసమ్మ ఆలయంలో గురువారం బోనాలు ఘనంగా నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలిపారు. డిపో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ సలహాలు, సూచనలు, సమస్యలను 99592 26141 నంబర్‌లో తెలియజేయాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిపో అభివృద్ధికి సహకరించాలన్నారు.

మహేశ్వరం ఆర్టీసీ డిపోలో..

మహేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ లక్ష్మీసుధ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ప్రయాణికులు 91542 98784 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించడంతోపాటు సమస్యలు తెలియజేయాలని తెలిపారు.

ఉత్తమ వైద్యాధికారులకు అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న వైద్యాధికారులు

షాద్‌నగర్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న వారికి హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రి ఆడిటోరియంలో గురువారం అవార్డులు అందజేశారు. డివిజన్‌లోని కేశంపేట పీహెచ్‌సీ డాక్టర్ నిఖిత, కొత్తూరు పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ నాగేష్, ఉత్తమ హెల్త్ ఎడ్యుకేటర్‌గా జె.శ్రీనివాసులు, కొందుర్గు పీహెచ్‌సీలో పని చేస్తున్న లుదియా జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నారు. ఉత్తమ పీహెచ్‌ఎస్‌గా చించోడ్ పీహెచ్‌సీలో పని చేస్తున్న చంద్రకళ, ఉత్తమ హెల్త్ సూపర్‌వైజర్‌గా నందిగామ పీహెచ్‌సీ ఫార్మాసిస్టు రాజేశేఖర్, బెస్టు నర్సుగా సునీత, ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా వెంకటముని, ఉత్తమ ఏఎన్‌ఎంగా స్వప్న, ఉత్తమ ఆశా వర్కర్‌గా రాధిక అవార్డులు అందుకున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి అవకాశాలు



దుకాణాల సముదాయన్ని పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి

చేవెళ్ల: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పేదలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ.. అభివృద్ధికి సహకరిస్తున్నట్లు కార్పొరేషన్ ఈడీ పద్మావతి అన్నారు. నియోజకవర్గంలోని చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ మండలాల్లో గురువారం కార్పొరేషన్ ద్వారా లబ్ధిపొందిన వారి ఉపాధి పనులను పరిశీలించారు.లబ్ధిదారులకు కేటాయించిన దుకాణాల్లో వారే ఉపాధి పనులు చేసుకోవాలని, ఇతరులకు కేటాయిస్తే రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. లబ్ధిదారులు అభివృద్ధి చెందుతూ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం మండలంలోని ఆలూరు, ధర్మసాగర్‌లో కార్పొరేషన్ ద్వారా కేటాయించిన భూములను పరిశీలించారు.ఆమె వెంట కార్పొరేషన్ అధికారులు ప్రసాద్, యశ్వంత్ ఉన్నారు.

రైతులందరికీ న్యాయం చేయాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం తదితరులు

మొయినాబాద్: గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న ఎనికేపల్లి రైతులందరికీ న్యాయం చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి భూముల వద్ద రైతులు చేపడుతున్న రిలే దీక్ష గురువారం 11వ రోజు కొనసాగింది. రైతులకు సంఘీభావం తెలిపిన కేఎస్ రత్నం మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని రైతులు ఓ వైపు దీక్ష చేస్తుంటే అధికారులు కొంతమంది రైతులకు పరిహారం పట్టాలు పంపిణీ చేస్తూ వారిని విడదీస్తున్నారన్నారు. రైతులను విడదీసి తగాదాలు పెట్టొద్దని.. అందరికీ సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గండిపేటలో జలదోపిడీ

నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు నిజాం కాలంలో నిర్మించిన గండిపేట జలాశయం ఇప్పుడు నీటి వ్యాపారులకు అడ్డాగా మారింది. జలాశయం చెంతనే ఉన్న రైతుల బోర్లను లీజుకు తీసుకుని అక్రమార్కులు నీటి వ్యాపారం చేస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ జలదోపిడీకి తెగబడుతున్నారు. జల వనరులను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. 'మూడు సంపులు.. ఆరు ట్యాంకర్లు' చందంగా నిత్యం లక్షల లీటర్ల నీటిని నగరానికి తరలిస్తూ దర్జాగా 'సొమ్ము' చేసుకుంటున్నారు.



గండిపేట చెరువు ఒడ్డున నీటి నిల్వకోసం వ్యాపారులు ఏర్పాటు చేసిన సంపు

బోర్లు లీజుకు తీసుకుని.. సంపుల ఏర్పాటు

- ట్యాంకర్ల ద్వారా నిత్యం లక్షల లీటర్ల తరలింపు
- 'సొమ్ము' చేసుకుంటున్న అక్రమార్కులు
- వాల్టా చట్టానికి యథేచ్ఛగా తూట్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో నీటివ్యాపారులు బరితెగించారు. గండిపేట చెరువు ఒడ్డున ఉన్న రైతుల బోర్లను లీజుకు తీసుకున్నారు. చెరువు పక్కనే వ్యవసాయ పొలాల్లో గుంతలు తీసి టార్పలిన్లు వేసి తాత్కాలిక సంపులు నిర్మించారు. బోర్ల ద్వారా సంపుల్లో నీటిని నిల్వ చేస్తున్నారు. సంపుల్లో నుంచి మోటార్ల ద్వారా వాటర్ ట్యాంకుల్లో నింపి నగరానికి తరలిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌లో 40 వేల నుంచి 50 వేల లీటర్ల నీటిని నింపుతున్నారు. ఒక్కో వ్యాపారి రోజుకు సుమారు 10–15 ట్యాంకర్ల ద్వారా లక్షల లీటర్ల నీటిని విక్రయిస్తూ క్యాష్ చేసుకుంటున్నారు. గండిపేట చెరువు ఒడ్డున హిమాయత్‌నగర్ రెవెన్యూలో ఇలా సుమారు పదికి పైగా సంపులను ఏర్పాటు చేశారు.

చెరువు పక్కనే బోర్లువేసి..

నీటి వ్యాపారానికి వినియోగిస్తున్న బోర్లన్నీ గండిపేట చెరువు ఒడ్డునే ఉండటం గమనార్హం. ప్రస్తుతం చెరువులో నీళ్లు నిండుగా ఉండటంతో బోర్లలో సమృద్ధిగా వస్తున్నాయి. దీంతో వ్యాపారులకు కాసుల పంట పండుతోంది. వాల్టా చట్టం ప్రకారం నీటిని ఇష్టానుసారంగా తోడేసి వ్యాపారం చేయడానికి వీల్లేదు. కానీ రైతులు వేసిన బోర్లను లీజుకు తీసుకున్న వ్యాపారులు వాటి నుంచి ఇష్టానుసారంగా నీటిని తోడేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నగరానికి తరలించే నీటిని కొత్తగా చేపడుతున్న నిర్మాణాలకు, కార్పొరేట్ కంపెనీలకు, అపార్టమెంట్లలో విక్రయించి లబ్ధి పొందుతున్నారు. 40 వేల లీటర్ల ట్యాంకర్ నీటిని రూ.20 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా ఒక్కో వ్యాపారి నిత్యం సుమారు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది.

పట్టించుకోని అధికారులు

గండిపేట జలాశయం ఒడ్డున జోరుగా నీటివ్యాపారం జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. జలమండలి అధికారులుగానీ, రెవెన్యూ అధికారులుగానీ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వస్తున్నాయి. నీటి వ్యాపారులకు స్థానిక నేతలతోపాటు పోలీసులు సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



నీటిని తరలిస్తున్న ట్యాంకర్

చర్యలు తీసుకుంటాం



గండిపేట చెరువు ఒడ్డున్న ఉన్న బోర్ల నుంచి నీటి వ్యాపారం జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. విషయాన్ని జలమండలి అధికారులకు సైతం తెలియజేశాం. ఇప్పటికే మూడు బోర్లు సీజ్ చేశాం. నీటిని తరలిస్తున్న ట్యాంకర్లపై కేసులు నమోదు చేయించాం. నీటి వ్యాపారం ఇలాగే కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయిస్తాం.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్



మహిళా సంఘాలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఆర్థికంగా ఎదిగితేనే అభివృద్ధి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేశారు. ఐదు మండలాలకు చెందిన 4,128 మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.4.96 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి మహిళను శక్తివంతురాలుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వడ్డీలేని రుణలతో ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు పెంటయ్యగౌడ్, గోవిందమ్మ, పీఏసీఎస్ చైర్మన్‌లు ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ చంద్రకళ, అడిషనల్ డీఆర్‌డీఏ జోజప్ప, డీపీఎం జయశ్రీ, తహసీల్దార్ కృష్ణయ్య, ఏపీఎం శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

21న పెన్షన్‌దారుల జిల్లా సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ

ఆమనగల్లు: పట్టణంలో ఈనెల 21న ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాదిగ తెలిపారు. ప్రభుత్వం చేయూత పెన్షన్ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు, చేయూత పెన్షన్ రూ.4 వేలకు పెంచి, అర్హులైన వారందరికీ అందించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా పెన్షన్ పెంచలేదని విమర్శించారు. పెన్షన్‌దారుల సమస్యలపై నిర్వహించే జిల్లా సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహమాదిగ, జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జంగయ్యమాదిగ తదితరులు పాల్గొన్నారు.



నాణ్యమైన విత్తన రకం వరి నారుమడిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉష తదితరులు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- జిల్లా వ్యవసాయాధికారి ఉష

షాద్‌నగర్‌రూరల్: భూమి కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్లలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూమి ఉన్న రైతు ఫార్మర్ ఐడీని పొందేందుకు ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్‌పుస్తకం, ఆధార్‌కు లింకు చేయబడిన మొబైల్ నంబర్‌ను తీసుకొని సమీపంలోని వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం అమలుచేసే పథకాలు వర్తిస్తాయని తెలిపారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

రైతులు పంటల సాగులో నాణ్యమైన విత్తనాలను ఉపయోగిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఉష అన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ నుంచి మండలంలోని ముగ్గురు రైతులకు 108 రకం వరి నాణ్యమై విత్తనాలను (ఫౌండేషన్ సీడ్స్) అందజేశారు. కొండన్నగూడలో రైతు వెంకట్‌రెడ్డి పొలంలో నాణ్యమైన విత్తన రకం వరి నారుమడిని ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నాణ్యమైన విత్తన రకం నుంచి వచ్చిన పంటతో రైతు స్వతహాగా విత్తనాలు తయారు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రమాదేవి, ఏఓ టెక్నికల్ అధికారిణి శోభారాణి, ఏఓ నిశాంత్‌కుమార్, ఏఈఓలు తేజ్‌కుమార్, గోవర్ధన్ పాల్గొన్నారు.

పావుకిలో చాలు



- కొండెక్కిన కూరగాయల ధరలు
- వారంలోనే అమాంతం పెరుగుదల
- ఏది కొనాలన్నా కిలో రూ.60 పైమాటే..
- ఆకుకూరలదీ అదే పరిస్థితి
- కిలో కొనేవారు పావుకేజీతో సరి

హుడాకాంప్లెక్స్: పచ్చిమిర్చి ధర ఘాటెక్కింది. నిన్న మొన్నటి వరకు కిలో రూ.30కే లభించగా ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్లో రూ.75 ధర పలుకుతోంది. అదే బహిరంగ మార్కెట్లో రూ.100 దాటింది. టమోటా కేజీ రూ.15లోపే ఉండగా రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. బెండకాయ, కాకరకాయ, వంకాయ, బీరకాయ, దోసకాయ, దొండకాయ ఇలా ఏ కూరగాయ కొనాలన్నా కిలోకి రూ.60పైనే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆకుకూరల ధరలు సైతం పెరుగుతూ పోతున్నాయి. పాలకూర, చుక్కకూర, మెంతికూర, గోంగూర, తోటకూర ఇలా ఏ ఆకుకూర ధర చూసినా కట్టను బట్టి ఒక్కో కట్టకు రూ.7నుంచి రూ.10 చెల్లించాల్సి వస్తోంది. గతంలో కిలో కూరగాయలు కొనుగోలు చేసిన వారు పెరిగిన ధరలతో ప్రస్తుతం పావు కిలోతో సరి పెట్టుకుంటున్నారు. జిల్లాలోని సరూర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, వనస్థలిపురం, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, చేవెళ్ల, మొయినాబాద్, శంషాబాద్, షాద్‌నగర్ మార్కెట్లతో పాటు కాలనీలు, బస్తీల్లో నిర్వహించే వారాంతపు సంతల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

భారీగా తగ్గిన సాగు

జిల్లా కాయగూరల సాగుకు పెట్టింది పేరు. ఒకప్పుడు హైదరాబాద్ నగరవాసులకు సరిపడా ఇక్కడే పండించే వారు. ఇబ్రహీంపట్నం, యాచారం, చేవెళ్ల, శంషాబాద్, మొయినాబాద్, మహేశ్వరం మండలాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో సాగు చేసేవారు. వ్యవసాయ భూములన్నీ ప్రస్తుతం రియల్టర్ల చేతుల్లోకి వెళ్లడం, ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, చీడపీడల నేపథ్యంలో సాగు గణనీయంగా పడిపోయింది. 2021–22 వానాకాలంలో 14,096 ఎకరాల విస్తీర్ణంలో, యాసంగిలో 19,222 ఎకరాల విస్తీర్ణంలో సాగవగా 3,08,460 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తి అయ్యేది. ప్రస్తుత వానాకాలంలో ఐదు వేల ఎకరాలకు మించి సాగవడం లేదు. మార్కెట్లో డిమాండ్ మేర దిగుబడి లేకపోవడంతో ఉమ్మడి ఏపీ జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రవాణా ఖర్చుల భారం సైతం కొనుగోలుదారులపై పడుతోంది.

రేట్లు భారీగా పెరిగాయి

వారం రోజుల వ్యవధిలోనే కూరగాయల రేట్లు విపరీతంగా పెరిగాయి. గతవారం వరకు రూ.200 తీసుకుని మార్కెట్‌కు వెళ్తే వారానికి సరి పడా కాయగూరలు వచ్చేవి. ఆ డబ్బులతో ప్రస్తుతం రెండు మూడు కిలోలు కూడా రావడం లేదు. గతంలో కిలోకి తగ్గకుండా కొనేదాన్ని. ప్రస్తుతం పావు కేజీతో సరిపెట్టుకుంటున్నా. పప్పుల ధరకు దీటుగా పచ్చిమిర్చి ధర పలుకుతోంది.

– విజయలక్ష్మి, గృహిణి

గిరాకీ ఉండడం లేదు

వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు సాగైతే కానీ ఇప్పట్లో ధరలు తగ్గే పరిస్థితి కన్పించడం లేదు. వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గడంతో వ్యాపారం కూడా లాభసాటిగా సాగడం లేదు. గతంలో రోజుకు రూ.2000 విలువ చేసే కాయగూరలను అమ్మితే ప్రస్తుతం రూ.500 కూడా అమ్మలేకపోతున్నాం. ఒకప్పుడు కిలో కొనుగోలు చేసే వారు సైతం ప్రస్తుతం పావు కిలో తీసుకెళ్తున్నారు.

– లక్ష్మయ్య, వ్యాపారి

చోటు లేక.. లోపలికి వెళ్లలేక

- కదులుతున్న బస్సు నుంచి జారి పడిన యువతి

యాచారం: సరిపడా ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు ఎదుర్కొంటున్నా అధికార యంత్రాంగంలో కదలిక లేదు. తాజాగా కిక్కిరిసిన బస్సులో ఎక్కిన ఓ యువతి ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తూ జారి పడిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అయ్యవారిగూడేనికి చెందిన అఖిల నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. రోజు మాదిరిగానే స్వగ్రామం వెళ్లడానికి గురువారం సాయంత్రం యాచారంలోని అంబేడ్కర్ చౌరస్తాలో యాచారం–కందుకూరు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సులో ప్రయాణికులు, విద్యార్థులు అధికంగా ఉండడంతో ఫుట్‌బోర్డు నుంచి లోపలికి వెళ్తుండగా బస్సు కదిలింది. ప్రయాణికుల రద్దీతో పట్టుకోవడానికి అవకాశం లేకపోవడంతో ఆమె అదుపుతప్పి జారి కిందపడిపోయింది. వెంటనే ఆమెను యాచారం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు తెలుసుకున్నారు. యాచారం–కందుకూరు రూట్లో అదనపు బస్సు ట్రిప్పులు పెంచాలని స్థానికులు డిమాండ్ చేశారు.



బస్సు నుంచి జారి పడిపోయిన యువతిని పైకి లేపుతున్న తోటి ప్రయాణికులు

కాంగ్రెస్ నాయకుడిపై హత్యాయత్నం



రవీందర్‌రెడ్డి గొంతుపై గాయం

షాద్‌నగర్ రూరల్: వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఓ కాంగ్రెస్ నాయకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన చిల్కమర్రిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి షాద్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి గ్రామంలో నిర్వహించిన బోనాల పండుగకు హాజరయ్యాడు. ఉత్సవాల్లో పాల్గొన్న అతనిపై ద్యాప శివకృష్ణారెడ్డి అలియాస్ కోటి హఠాత్తుగా దాడికి పాల్పడ్డాడు. బ్లేడుతో గొంతు కోయడంతో తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. దాడిని ఆపేందుకు ప్రయత్నించిన సత్యంరెడ్డి అనే మరో వ్యక్తికి సైతం గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆఫీస్‌రూం కేటాయించండి

ఇబ్రహీంపట్నం రూరల్: టీజీఓఎస్ అసోసియేషన్‌కు కలెక్టరేట్‌లో ఆఫీస్‌రూం కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, కార్యదర్శి శ్రీనేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశం, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణస్వామి, ఉపాధ్యక్షులు శాంతిశ్రీ, రాకేష్, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దర్యాప్తు

- ఎనికేపల్లిలో ప్రభుత్వ భూముల విక్రయం కేసు

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి సర్వేనంబర్ 180లోని 99.14 ఎకరాల ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో విక్రయించేందుకు అగ్రిమెంట్ చేసిన కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎనికేపల్లికి చెందిన డప్పు రమేష్ నకిలీ పత్రాలు సృష్టించి అగ్రిమెంట్ చేసి రూ.1.50 కోట్లు తీసుకుని మోసం చేశాడంటూ ఈ నెల 14న నగరానికి చెందిన బి.లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి రమేష్ పరారీలో ఉన్నడు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు నిందితున్ని పట్టుకోవడానికి ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపడుతున్నారు. సెల్ లొకేషన్స్ ఆధారంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. నిందితుడు ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడుతున్నారనే విషయాలను కాల్ డేటా ఆధారంగా తెలుసుకుంటున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తే ఈ వ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉందనే విషయాలు బయటికి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు రెవెన్యూ అధికారులు సైతం ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇచ్చినట్లుగా ఉన్న పొజిషన్ సర్టిఫికెట్ల తయారీలో అప్పటి రెవెన్యూ అధికారుల ప్రమేయం ఏమైనా ఉందా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.

ఫోర్జరీ చేసి.. ఆస్తులు కాజేసి

తప్పుడు వీలునామా పత్రాలు
సృష్టించిన కేసులో దంపతుల అరెస్టు

చేవెళ్ల: రూ.కోట్లు విలువ చేసే భూమికి తప్పుడు వీలునామా పత్రాలు సృష్టించి కాజేసిన వ్యవహారంలో దంపతులు అరెస్టయిన సంఘటన మండల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం భార్యాభర్తలను రిమాండ్‌కు తరలించగా మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన రెవెన్యూలో మత్తేగారి ప్రతాప్‌రెడ్డికి వివిధ సర్వే నంబర్లలో 125 ఎకరాల భూమి ఉంది. ఆయనకు సంతానం లేకపోవడంతో భార్య అనసూయ పేరుపై కొన్ని ఆస్తులున్నాయి. ప్రతాప్‌రెడ్డి తల్లి తరఫు బంధువులైన జగన్‌మోహన్‌రెడ్డితో సన్నిహితంగా ఉండేవారు. పిల్లలు లేని కారణంగా దత్తత తీసుకున్నట్లు నమ్మబలికి కొంత భూమిని జగన్‌మోహన్‌రెడ్డిపై బదలాయించుకున్నారు. ఆ తరువాత తలెత్తిన వివాదాలతో 2017లో ప్రతాప్‌రెడ్డి అక్రమంగా భూమిని బదలాయించుకున్నాడని జగన్‌మోహన్‌రెడ్డిపై కోర్టులో కేసు వేశారు. ఈ క్రమంలో 2018లో ప్రతాప్‌రెడ్డి చనిపోవటంతో ఉన్న ఆస్తినంతా జగన్‌మోహన్‌రెడ్డి తన భార్య సురేఖలకే చెందుతుందని ఫోర్జరీ డాక్యుమెంట్ తయారు చేసి కాజేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రతాప్‌రెడ్డి దాయాదులైన రామేశ్వర్‌రెడ్డి అతని సోదరులు 2023లో కోర్టుకెక్కారు. ప్రతాప్‌రెడ్డికి సంతానం లేదని ఆయనకు దాయాదులైన మేమే అసలు వారసులమని జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు, సోదరులు అంతా కలిసి అక్రమంగా వీలునామాను సృష్టించి ఆస్తిని కాజేశారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలతో పోలీసులు విచారణ చేసి వీల్‌డీడ్‌ను ఎఫ్‌ఎస్‌ఎల్‌కి పంపించటంతో వీల్ డీడ్‌లో చేసిన ప్రతాప్‌రెడ్డి సంతకం ఫోర్జరీ చేసినట్లుగా నిర్ధారించారు. ఈ వ్యవహారంలో 10 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే జగన్‌మోహన్‌రెడ్డి అతని భార్య సురేఖను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా ఆరుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆహ్వానం



కలెక్టర్ నారాయణరెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: శిక్షణ తరగతులకు హాజరయ్యే జర్నలిస్టులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసే కార్యక్రమానికి రావాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం, సంఘం ప్రతినిధులు కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. నాంపల్లిలోని మీడియా అకాడమీ భవన్‌లో శిక్షణ తరగతులు కొనసాగుతాయని, 24న సర్టిఫికెట్ల ప్రదానం ఉంటుందని తెలిపారు.

లైన్ క్లియర్!

యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌కు మార్గం సుగమం

- రాష్ట్ర ప్రభుత్వంతో పొత్తు లేకుండానే నిర్మించనున్న రైల్వేశాఖ
- ఇటీవల స్పష్టం చేసిన ఆ శాఖ సహాయ మంత్రి
- రూ.430 కోట్లతో 33 కి.మీ వరకు కొత్తగా ఎంఎంటీఎస్ లైన్‌లు
- 2015లోనే యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌కు ప్రతిపాదనలు
- త్వరలో పనులు చేపట్టనున్న దక్షిణమధ్య రైల్వే

సాక్షి, సిటీబ్యూరో



ఎట్టకేలకు యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్ట్‌లో కదలిక వచ్చింది. పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన ప్రాజెక్టును రైల్వేశాఖ సొంతంగా నిర్మించేందుకు సన్నద్ధమైంది. ఘట్‌కేసర్ నుంచి యాదగిరిగుట్ట (రాయగిరి) వరకు 33 కి.మీ మార్గాన్ని కొత్తగా నిర్మించనున్నారు. మొదట్లో ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం, రైల్వేశాఖ సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించారు. ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూమి, వనరులు, నిధులు, ఇతర మౌలిక సదుపాయాలకయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమంగా పంచుకోవాలని భావించారు. ఈ ఒప్పందానికి అనుగుణంగా 2016లో దక్షిణమధ్య రైల్వే క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించింది. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు లైన్‌ల నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించింది. అనంతరం ఈ ప్రాజెక్టు ముందుకు కదల్లేదు, ఒకటి, రెండు బడ్జెట్‌ల్లో కేంద్రం కొన్ని నిధులను కేటాయించింది. అదే స్థాయిలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు, వనరులు లభించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ క్రమంలో రైల్వేశాఖ సైతం వెనకడుగు వేసింది. ఇలా 2016 నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

ఇటీవల రూ.100 కోట్లు..

లక్షలాది మంది భక్తులు సందర్శించుకునే యాదగిరి గుట్ట పుణ్యక్షేత్రానికి రైల్వే సదుపాయం అందుబాటులో లేకపోవడంతో రైల్వేశాఖ సీరియస్‌గా దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకుండానే ఇక్కడికి ఎంఎంటీఎస్ సదుపాయాన్ని కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు గత సంవత్సరమే ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకనుగుణంగానే ఇటీవల రూ.100 కోట్లు అందజేసింది. ప్రాజెక్టును ప్రతిపాదించిన మొదట్లో రూ.10 కోట్లు, ఆ తర్వాత రెండు దఫాలుగా రూ.60 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.430 వరకు ఖర్చు కానున్నట్లు అంచనా. పదేళ్ల జాప్యం వల్ల నిర్మాణ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది.

సొంత నిధులతోనే పనులు..

రైల్వేశాఖ ఈ ప్రాజెక్టును సొంత నిధులతో నిర్మించనుందని ఆ శాఖ సహాయ మంత్రి రవనీత్‌సింగ్ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలోనూ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన పార్లమెంట్ సమావేశాల్లో 'జీరో అవర్'లో యాదగిరి గుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్టుపై ఎంపీ కేంద్రాన్ని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు రైల్వేశాఖ సహాయమంత్రి రాతపూర్వకంగా తమ స్పందన తెలిపారు. అంతేకుండా ఈ ఆర్థిక సంవత్సరం రూ.100 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్రరైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ఈ ప్రాజెక్టును సొంతంగానే చేపట్టనున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు సైతం స్పష్టం చేశారు. త్వరలోనే రైల్‌వికాస్‌నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) పనులు చేపట్టనుంది.

లక్షలాది మందికి ఊరట...

యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్టు పూర్తయితే లక్షలాదిమంది భక్తులకు గొప్ప ఊరట లభించనుంది. ప్రస్తుతం ప్రతిరోజు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లోనే ప్రయాణికులు యాదగిరిగుట్టకు రాకపోకలు సాగిస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు ఎంఎంటీఎస్ రైళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ నేరుగా పుణ్యక్షేత్రం వరకు వెళ్లే సదుపాయం లేదు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే లింగంపల్లి, బేగంపేట్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, మేడ్చల్, చర్లపల్లి తదితర ప్రాంతాల నుంచి ఎంఎంటీఎస్ రైళ్లలో నేరుగా రాయగిరి వరకు రాకపోకలు సాగించవచ్చు. అక్కడి నుంచి 4 కి.మీ. మాత్రం రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికే నగరంలో మొదటి, రెండో దశ ఎంఎంటీఎస్ ప్రాజెక్టులు పూర్తయినందువల్ల యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ మూడో దశ ప్రాజెక్టుగా చేపట్టనున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

మొయినాబాద్: అతివేగంతో వచ్చిన మహీంద్రా థార్ బైక్‌ను ఢీకొట్టడంతో కండక్టర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామానికి చెందిన ఈదులకంటి శ్రీనివాస్ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు డ్యూటీకి వెళ్లడానికి తన బైక్‌పై బయలుదేరాడు. ముర్తుజాగూడ సమీపంలోని గుడ్ షెఫ్ స్కూల్ వద్దకు వెళ్లగానే అతివేగంతో వచ్చిన మహీంద్రా థార్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వరుణుడి కోసం ప్రత్యేక పూజలు



దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు

షాబాద్: వర్షాలు లేక రైతులు అల్లాడుతున్నారు.. వేసిన పంటలు ఎక్కడ వాడిపోతాయోనని బిక్కుబిక్కుమంటున్నారు. అంతా వరుణుడి రాక కోసం వేయి కళ్లతో చూస్తున్నారు. గురువారం మండల పరిధిలోని కొమరబండ శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో వర్షాల కోసం గ్రామస్తులు, రైతులు ప్రత్యేక పూజలు చేసి, వరదపాశం పోశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దేవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు శివకుమార్, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం.. ఆటోల చోరీ



రాజేంద్రప్రసాద్, నిందితుడు

శంకర్‌పల్లి: జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు డబ్బుల కోసం ఆటోల చోరీకి పాల్పడి కటకటాల పాలయ్యాడు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్‌కి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఆటో ఈనెల 14న కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. గురువారం చేవెళ్ల మండల ఎన్కేపల్లి వద్ద తనిఖీలు చేస్తుండగా.. పోలీసులను చూసి నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతడికి అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు నవాబుపేట మండలం కద్పూర్ల గ్రామానికి చెందిన దుర్గంచెరువు రాజేంద్రప్రసాద్(25)గా గుర్తించారు. ఈ నిందితుడిపై గతంలో వికారాబాద్, మర్పల్లి, మోమిన్‌పేట్, సదాశివపేట, పరిగి తదితర పోలీస్‌స్టేషన్లలో 14 కేసులు నమోదయ్యాయి. నిందితుడు పది రోజుల క్రితమే జైలు నుంచి విడుదలై, మళ్లీ ఆటో దొంగతనం చేసి దొరకడం గమనార్హం.

కోడలి వేధింపులు తాళలేక అత్త ఆత్మహత్య

నాంపల్లి: కోడలి వేధింపులు తాళలేక అత్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హబీబ్‌నగర్ లోథ్‌బస్తీలో రామేశ్వర్‌సింగ్, ఉషాబాయి దంపతులు నివాసం ఉంటున్నారు. వారు కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లగా నాసిక్‌లో అత్తాకోడళ్ల మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి కోడలి వేధింపులు తాళలేక ఉషాబాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల పేరిట మోసం..

భార్యాభర్తలకు జైలు, జరిమానా

చిలకలగూడ: చిట్టీల పేరిట మోసానికి పాల్పడిన భార్యాభర్తలకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయ స్థానం గురువారం తీర్పు చెప్పింది. చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిలకలగూడ ఠాణా పరిధి పార్శిగుట్టకు చెందిన రవీందర్, సుజాత దంపతులు చిట్టీల వ్యాపారం నిర్వహించేవారు. మొదట్లో తక్కువ మొత్తాలకు చిట్టీలు వేసి సకాలంలో డబ్బులు తిరిగి చెల్లించి స్థానికుల్లో నమ్మకం సంపాదించారు. ఆ తర్వాత పెద్దమొత్తంలో చిట్టీలు ప్రారంభించి ఎక్కువ మందిని చేర్చుకున్నారు. కాల పరిమితి ముగిసినా చిట్టీ డబ్బులు చెల్లించకుండా, అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి రూ. లక్షలు వసూలు చేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు ఆర్థిక మోసానికి పాల్పడిన రవీందర్, సుజాతతోపాటు వారికి సహకరించిన శంకర్, రాజేశ్వర్‌లపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన అప్పటి ఎస్‌ఐ పెండ్యాల జయశంకర్ నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో న్యాయస్థానం విచారణ చేపట్టింది. వాదోపవాదాలు విన్న తర్వాత సికింద్రాబాద్ 19వ అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అరుణ గురువారం నిందితులు రవీందర్, సుజాతలకు ఏడాది జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. వీరికి సహకరించిన శంకర్, రాజేశ్వర్‌లపై కేసు కొట్టివేశారు.

టమాటా లారీ బోల్తా

రాజేంద్రనగర్: ప్యాసింజర్ ఆటో అడ్డు రావడంతో దానిని తప్పించే క్రమంలో డీసీఎం ఫుట్‌పాత్‌ను ఢీ కొనడంతో వాహనం బోల్తా పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లాకు చెందిన గంగాధర్ డీసీఎంలో ప్రతిరోజు నగరంలోని కూరగాయల మార్కెట్‌లకు కూరగాయలను సరఫరా చేస్తుంటాడు. గురువారం ఉదయం డీసీఎంలో టమాటా లోడ్ తీసుకొని ఆరాంఘర్ మీదుగా గుడిమల్కాపూర్ వెళుతుండగా రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తా 215 పిల్లర్ వద్దకు రాగానే ప్యాసింజర్ ఆటో రాంగ్ రూట్‌లో దూసుకొచ్చింది. దానిని తప్పించే క్రమంలో డీసీఎం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. డీసీఎంలోని టమాటాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. డ్రైవర్ గంగాధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ కారణంగా దాదాపు గంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ ద్వారా డీసీఎంను పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. డీసీఎం యజమాని ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాపరాతి వ్యాపారికి సైబర్ షాక్

తాండూరు రూరల్: సైబర్ క్రైం వలలో ఓ నాపరాతి వ్యాపారి పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని అంతారం గ్రామ శివారులోని ఓ పాలిషింగ్ యూనిట్ యజమానికి జరిగింది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. పెద్దేముల్ మండలం తట్టెపల్లికి చెందిన అరుణ్‌కుమార్ అంతారం గ్రామ శివారులో ఓ పాలిషింగ్ యూనిట్ నిర్వహిస్తున్నారు. తన పరిశ్రమ నుంచి నిత్యం లారీల్లో నాపరాతి బండలను వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో బండలను తరలించేందుకు లారీలు అవసరం కావడంతో ఆయన మహవీర్ ట్రాన్స్‌పోర్టుకు కాల్ చేశారు. బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి అరుణ్‌కుమార్‌కు కాల్ చేసి తక్కువ ధరకు లారీలు పంపిస్తున్నామని చెప్పారు. వాట్సాప్‌లో లారీ ఫొటో, ఆర్సీ పంపించి నమ్మించారు. అయితే ముందుగా డీజిల్‌కు రూ.17,500 పంపించాలని గుర్తు తెలియని వ్యక్తి అరుణ్‌ను కోరగా ఫోన్ పే చేశారు. ఎంతకీ లారీలు రాకపోవడంతో పాటు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. తనను సైబర్ నేరగాళ్లు మోసం చేశారని పట్టణ పోలీసులకు గురువారం అరుణ్ ఫిర్యాదు చేశారు. తనలా ఎవరూ మోసపోవద్దని సూచించారు.

'డబుల్' ఇళ్లకు వసతులు కల్పించండి



ఆర్డీవో కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న యాదయ్య తదితరులు

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఇబ్రహీంపట్నం: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య డిమాండ్ చేశారు. గురువారం డబుల్ బెడ్రూం లబ్ధిదారులతో కలిసి ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో డీటీ యశ్వంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. మంచాల మండలంలోని లింగంపల్లి గేట్ వద్ద నిర్మించిన 96 డబుల్ బెడ్రూం ఇళ్లను మంచాల, నోముల, లింగంపల్లి గ్రామాల పేదలకు తహసీల్దార్ సమక్షంలో లాటరీ పద్ధతిలో గత ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అప్పట్లో లబ్ధిదారులను గృహ ప్రవేశం చేయించలేకపోయారన్నారు. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తమకు కేటాయించిన ఇళ్లలోకి వెళతామని పలుమార్లు లబ్ధిదారులు వినతిపత్రాలు అందజేసినా 18 నెలలుగా స్పందన లేదన్నారు. దీంతో లబ్ధిదారులే గృహ ప్రవేశం చేశారన్నారు. కానీ అక్కడ తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించకుంటే లబ్ధిదారుల కుటుంబసభ్యులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్, కృష్ణ, యాదయ్య, జంగయ్య, గోపాల్, జంగమ్మ, బాలరాజు, సరిత, స్వాతి, భాను, మౌనిక, సంతోష లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన చేపల వేట

- కుంటలో మునిగి వ్యక్తి మృతి
- ఉట్లపల్లిలో విషాదం



అంజయ్య (ఫైల్)

కడ్తాల్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతిచెందిన ఘటన మండల కేంద్రం సమీపంలోని కానుగుల కుంటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కందుకూరు మండలం ఉట్లపల్లికి చెందిన దొంతుల అంజయ్య(45) మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇదే గ్రామానికి చెందిన రాజు, కృష్ణయ్య, శ్రీనుతో కలిసి, చేపలు పట్టేందుకు కానుగుల కుంటకు వెళ్లారు. ఈ క్రమంలో చెరువులోకి దిగిన అంజయ్య ప్రమాదవశాత్తు నీట మునిగి, బయటికి రాలేకపోయాడు. మిగిలిన వాళ్లు వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితులతో పాటు కడ్తాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, బుధవారం అర్ధరాత్రి వరకు చెరువులో గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం స్థానిక ఎస్‌ఐ వరప్రసాద్, పోలీసు సిబ్బంది, మహేశ్వరానికి చెందిన ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు కుంటలో గాలించి ఊబిలో కూరుకుపోయిన మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శామంతతో పాటు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. అంజయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు
- పొలం వద్ద తీగలు సరిచేస్తుండగా ప్రమాదం



నర్సింలు మృతదేహం

కొందుర్గు: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన శ్రీశైలం అనే రైతు తన పొలంలో విద్యుత్ తీగలు సరిచేయాలని లైన్‌మన్ చెన్నయ్యకు సమాచారం అందించాడు. ఇందుకోసం ఎల్‌సీ తీసుకోమని సూచించాడు. ఎల్‌సీ ఇచ్చినట్లు చెప్పగానే ఇదే గ్రామానికి చెందిన కాత్రమోని నర్సింలు(46)ను కరెంటు స్తంభం ఎక్కించాడు. పనులు చేస్తుండగా ఒక్కసారిగా కరెంట్ రావడంతో నర్సింలు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. ఎల్‌సీ ఇచ్చిన విషయాన్ని మర్చిపోయిన లైన్‌మన్ సబ్ స్టేషన్‌నుంచి సరఫరాకు అనుమతించడంతోనే ప్రమాదం జరిగిందని శ్రీశైలం ఆరోపించాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని, వీరికి న్యాయం చేయాలని బాధితులు సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. లాల్‌పహాడ్ చౌరస్తాలో షాద్‌నగర్- పరిగి రోడ్డుపై బైఠాయించారు. అక్కడికి చేరుకున్న చౌదరిగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. ఈ విషయమై ఎస్‌ఐ విజయ్‌ని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. నర్సింలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

ప్రేమ పేరుతో మోసం..

వెంగళరావునగర్: ప్రేమించానని నమ్మించి మోసం చేయడమే గాక బ్లాక్‌మెయిల్ చేస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన యువతి నగరంలో ఉంటూ ప్రైవేట్ సంస్థలో క్యాషియర్‌గా పని చేస్తోంది. ఆమెకు యూసుఫ్‌గూడకు చెందిన అల్లవారి శ్రీధర్ అనే యువకుడితో ఇన్‌స్టాగాం పరిచయం ఏర్పడింది. అనంతరం ప్రేమించానని నమ్మించి పలుమార్లు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో కొన్నాళ్లుగా దూరం ఉంటున్నాడు. దీంతో బాధితురాలు ఈ విషయాన్ని అతని తల్లిదండ్రులకు చెబుతానని అనడంతో ఆగ్రహానికి లోనైన శ్రీధర్ ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దాంతో బాధితురాలు గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి అదృశ్యం



కాంతిదేవి (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మణ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన హరి ఓం కుమార్, కాంతిదేవి(26) దంపతులు బతుకుదెరువు నిమిత్తం 45 రోజుల క్రితం జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీకి వలస వచ్చారు. కాంతిదేవి స్థానికంగానే ఉన్న చాక్లెట్ కంపెనీలోకి పనికి వెళుతుంది. ఈ నెల 14వ తేదీన అనారోగ్యంగా ఉందని ఆమె పనికి వెళ్లలేదు. భర్త డ్యూటీకి వెళ్లి రాత్రి తిరిగొచ్చేసరికి ఆమె కనిపించలేదు. స్థానికంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై బుధవారం రాత్రి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ కాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.


వైభవంగా కట్టమైసమ్మ బోనాలు



బోనాలు సమర్పిస్తున్న భక్తులు

పహాడీషరీఫ్: బాలాపూర్ గుర్రం చెరువు కట్టమైసమ్మ ఆలయంలో గురువారం బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఉదయం నుంచే బాలాపూర్, చాంద్రాయణగుట్ట, కేశవగిరిలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున వాహనాలలో ఆలయం వద్దకు చేరుకొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి తొట్టెల, బోనాలు సమర్పించారు. జీవాలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సున్నితమైన ప్రాంతం కావడంతో బోనాల సందర్భంగా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

మిస్సింగ్ కేసు



బాబు (ఫైల్)

మొయినాబాద్: దంపతులు గొడవ పడగా.. భార్య పుట్టింటికి వెళ్లగా భర్త అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా బండగొండకు చెందిన పల్లె బాబు(40) కొన్నేళ్ల క్రితం భార్య మరణించడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండో పెళ్లి చేసుకున్న భార్యతో కలిసి మొయినాబాద్‌లో ఉంటూ కూలీ పనిచేసేవాడు. పదిహేను రోజుల క్రితం భార్యాభర్తలు గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లింది. అదే రోజు ఇంటికి తాళం వేసి బాబు వెళ్లిపోయాడు. ఇటీవల బండగొండలో ఉండే బాబు మొదటి భార్య కొడుకు అంజప్ప మొయినాబాద్‌కు వచ్చాడు. తన తండ్రి అద్దెకు ఉండే ఇంటికి వచ్చాడు. ఇంటికి తాళం వేసి ఉండటంతో పుట్టింటికి వెళ్లిన తల్లికి ఫోన్‌చేసి అడిగాడు. అక్కడికి రాలేదని చెప్పడంతో పరిసర ప్రాంతాల్లో వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో గురువారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొట్టి బాలుడికి గాయాలు

మొయినాబాద్: రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టి ఓ బాలుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌కు చెందిన నహీద్ చిన్న కొడుకు ఎండీ ఫిజాన్(రెండున్నర సంవత్సరాలు) ఈ నెల 13న సాయంత్రం గ్రామంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని బైక్ ఢీకొట్టింది. దీంతో అతని గాయాలయ్యాయి. ఈ విషయమై గురువారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.